


"వికాస్! ఏమిటి సంగతులు? ఉద్యోగం ఎలా వుంది? అమెరికా ఎలా వుంది?" మూర్తి అడిగాడు.

"అమెరికాలో ఏం తక్కువ బావ! మిమ్మల్నందర్నీ మాత్రం మిస్ అయ్యాము" అన్నాడు వికాస్.

"అక్కడేమిటోయ్! అన్ని సదుపాయాలూ వున్నాయి. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేసుకుంటారు. బోల్డు డబ్బు! వచ్చిన దగ్గర్నుండి హడావడే సరిపోయింది. అమెరికా నుంచి మాకేమి గిఫ్ట్సు తీసుకు వచ్చావ్" అన్నాడు మూర్తి.

"ఈసారి వీడియో తీసుకు వచ్చాను బావ! వీడియో కెమెరా కూడా తీసుకు వచ్చాను. రేపు మీ అందరి వీడియో తీసి రేపు రాత్రికి ఫిల్మ్ చూపిస్తాను".

"ఎలాగైనా అమెరికా అమెరికానేనోయ్. అన్నింటిలోనూ ముందంజే వాళ్ళు. ఆడవాళ్ళు కూడా అన్ని రంగాలలోనూ ఎంతో ముందు వుంటారు. అక్కడి వేగం, ఆడవాళ్ళు కూడా మొగవారితో పాటు ఉద్యోగాలు చెయ్యడమే కాకుండా ఇంటి పనులు కూడా స్వయంగా చేసుకుంటారు కదా! వింటుంటే ముచ్చట వేస్తుంది".

"అదేమిటి బావా అలా అంటావు? ఇక్కడ ఆడవాళ్ళు మాత్రం ఇంట్లో ఖాళీగా వుంటున్నారా? పాశ్చాత్య నాగరికత, అలవాట్లు ప్రతీ ఇంట్లోనూ, నాకు కొన్ని సంవత్సరాల మార్పులోనే కనిపిస్తున్నాయి. ప్రతీ ఇంట్లోనూ ఫ్రిజ్‌లు, టి. వి. లు, స్టీరియోలు, ఎ. సి. లు, స్కూటర్లు, మారుతీ కార్లు కనిపిస్తున్నాయి. ఎంతోమంది ఆడవాళ్ళు ఉద్యోగాలు చేస్తున్నారు. ఒక్క ఆరు సంవత్సరాల్లో జరిగిన ఈ మార్పు చూస్తుంటే నాకు ఆశ్చర్యమేస్తోంది!"

"ఆ ఏం మార్పులే! మీ అక్కని చూడరాదూ! చదువుకున్నది కదా! ఉద్యోగం చెయ్యమంటే చెయ్యనంటుంది. ఆధునిక సౌకర్యాలని నీవు చెప్పిన ఫ్రిజ్, గ్రైండర్, వాషింగ్ మిషన్, లాంటి అన్ని సౌకర్యాలూ మా ఇంట్లో వున్నాయి. అయినా ఎప్పుడూ మీ అక్క పని లేదే. పగలంతా ఇంట్లో వుంటుంది కదా! ఏం చేస్తుందసలు! పని చెయ్యలేక అలసి పోతున్నాననుకుంటుంది. ఇంక అమెరికాలో పని చెయ్యడానికి రొబట్లు కనిపెట్టారట. అది కూడా మీ అక్కకి కొనిపెడితే ఆమె పగలంతా ఇరుగు

పొరుగులతో బాతాఖానీ కొట్టవచ్చును" అన్నాడు మూర్తి వేళాకోళంగా భార్యని చూస్తూ.

అతని మాటలు వింటూ నవ్వి వూరుకుంది వాసవి. వికాస్‌కి మాత్రం అక్కని బావ అలా అనడం చాలా బాధ వేసింది. వచ్చిన దగ్గర్నుండి చూస్తున్నాడు అక్క దినచర్య. బావ చెప్పిన దాన్లో ఎంత నిజం వుంది.

వికాస్ అమెరికా నుండి 6 సంవత్సరాల తర్వాత ఇండియా వచ్చాడు. తల్లిదండ్రులని చూసి అక్కా, బావలని. చూడ్డానికి వచ్చాడు. పొద్దున్నే మూర్తి ఆఫీసుకి వెళ్ళే హడావడిలోనూ, 10 ఏళ్ళ సందీప్ స్కూలుకి వెళ్ళే హడావడిలోనూ, 16 ఏళ్ళ నీలేష్ కాలేజీకి వెళ్ళే హడావడిలోనూ వున్నారు. ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయారు. ఇదిగో! రాత్రి ఇప్పుడే సావకాశంగా మాట్లాడుకోవడానికి బావమరదులకి కుదిరింది.

* * * * *

రెండు రోజులు గడిచాయి. ఆ రోజు సాయంత్రం మూర్తి, సందీప్, నీలేష్ ఇంట్లోనే ఉన్నారు. వాసవి మాత్రం ఎక్కడో పేరంటం వుందని వెళ్ళింది. అక్కడ పూజ వుందని, అర్చన, హారతీ అవీ అయ్యేటప్పటికి లేటవుతుందని, వంటంతా చేసి పెట్టి వుంచానని, ఆకలి వేస్తే తినెయ్యమని చెప్పి మరీ వెళ్ళింది.

"మనం మంచి వీడియో ఫిల్మ్ చూద్దాం" అన్నాడు వికాస్.

"ఏం ఫిల్మ్ మామయ్యా!" అని ఒక్కసారి ఉత్సాహంగా అడిగారు నీలేష్, దీపూ.

"మీ ఇంట్లో మీకు తీసిందే చూపిస్తున్నాను" అన్నాడు వికాస్.

"అరె! మా ఫిల్మా! ఎప్పుడు తీశావు మామయ్యా! మేము బాగా వచ్చామా? మాకు తెలవకుండా ఎలా తీశావు"

"అదే గమ్మత్తు ఇప్పుడు చూడండి".

పిల్లలిద్దరూ సరేసరి. మూర్తి కూడా తను వీడియోలో ఎలా వుంటాడోనన్న థ్రిల్‌తో చూస్తున్నాడు. వికాస్ వీడియో సెట్ చేసి ఆన్ చేసాడు.

* * * * *

పొద్దున్న 5.30 గంటలు చూపిస్తోంది గడియారం. వాసవి పాలవాడు యిచ్చిన పాకెట్లు తీసుకుని వంటింట్లోకి వెళ్ళింది. కాఫీకి డికాషన్ తీసి, పాలు వేడిచేసి, ముందర వీధి గుమ్మం కడుక్కుని ముగ్గువేసివచ్చింది. మూర్తి నిద్రలేస్తూనే 'వసూ! కాఫీ' అంటూ అడిగాడు.

న్యూస్‌పేపరుతో పాటు కాఫీ కప్పు కూడా చేతికి యిచ్చింది. తను కూడా కాఫీ తాగుతూనే బ్రేక్‌ఫాస్ట్‌కి కావల్సినవి అమర్చుకుంటోంది.

"దీపూ! నీలూ! నిద్రలేవండమ్మా! ఏడైపోయింది" వాసవి నెమ్మదిగా అంది.

"అబ్బ! ఏమిటి మమ్మీ! కాసేపు పడుకోనియ్యవు!"

"నాకేం! మళ్ళీ కాలేజీకి లేటైపోయింది! నన్నెందుకు లేపలేదంటావ్! నేను వెడుతున్నా."

నీలేష్ కాసేపు బద్ధకంగా అటూయిటూ దొర్లి లేచి కూర్చున్నాడు.

"వాసవీ! ఇక్కడ నేను గడ్డం గీసుకునే మగ్ పెట్టాను. ఏమైంది?" మూర్తి కేకపెట్టాడు.

చపాతీలు పిండి కలుపుతున్న చేతితోనే వాసవి వంటింటిలోంచి యివతలకి వచ్చింది. అటూయిటూ వెతికి మగ్ తీసుకువచ్చి యిచ్చింది.

"మమ్మీ! 8 అయిపోయింది. ఇంకా టిఫిన్ చెయ్యడం పూర్తికాలేదా?" అంటూ డైనింగ్‌టేబుల్ దగ్గరకివెళ్ళి ఫ్యాన్ ఆన్‌చేసుకుని కూర్చున్నాడు నీలేష్.

"ఇదిగో తీలూ అయిపోవచ్చింది. కొంచెం ఆ ప్లేటూ, మంచినీళ్ళూ పెట్టుకొని కూచోవూ" హడావడిపడిపోతూ అంటోంది వాసవి. గేస్‌మీద ఒకవైపు చపాతీలు కాలుస్తూ, ఒకవైపు కూర కలియబెడుతూను. ఆ వేడికి చెమటలు ధారగా కారుతున్నాయి.

"అబ్బ! ఏమిటి మమ్మీ! కూచున్నాక చెబుతావు? ప్లీజ్ ఆ చేత్తో యిచ్చేద్దూ!"

వాసవి గబగబా రెండు చపాతీలువేసి, ఒక చేత్తో మంచినీళ్ళగ్లాసు పట్టుకొచ్చి యిచ్చింది.

"మమ్మీ! ప్లీజ్. నాకు ఈ సైన్స్ రికార్డ్‌లో బొమ్మలు వేసిపెట్టవూ! చక్కగా, నీట్‌గా వుంటుంది నీ డ్రాయింగ్. మళ్ళీ రేపు రికార్డ్ యిచ్చేయాలి. నాకు సాయంత్రం క్రికెట్‌వుంది. కాలేజీలో ఒక్క పీరియడ్ కూడా ఖాళీలేదు. మాష్టార్ రేపు కనక యివ్వకపోతే పనిష్‌చేస్తారు. ప్లీజ్ కాస్త వేసిపెట్టవా?"

"సర్లే! నీ టేబుల్‌మీద పెట్టివెళ్ళు" అంది వాసవి.

గబగబా టిఫిన్‌చేసి 'అరె అప్పుడే 8.30 దాటిపోయిందే. మమ్మీ! మర్చిపోకేం. నేను వెడుతున్నాను" అంటూ ప్లేటులోనే చెయ్యికడిగేసుకుని హడావిడిగా నీలేష్ వెళ్ళిపోయాడు.

ప్లేటుతీసి సింక్‌లో పడేస్తూనే "ఒరేయ్ దీపూ! నువ్వు రావేరా? స్కూలుకి టైమైపోతోంది. టిఫిన్‌బాక్స్ బేగ్‌లో పెట్టాను. మళ్ళీ యివతల పడెయ్యకు. మర్చిపోతావు. రా తొందరగా చల్లారిపోతే చపాతీలు సయించవంటావు."

"అబ్బ ఏమిటి మమ్మీ! మళ్ళీ ఈ కూరేనా! ఛ! నాకొద్దు! ఛోలే చెయ్యమంటే ఎందుకు చెయ్యవు?"

"ప్రొద్దున్నే హడావడిగా కుదరదురా! ఛోలే చెయ్యడానికి చాలా టైముపడుతుంది. శెలవురోజు చేస్తానులే."

ఎప్పుడూ హడావడి, హడావడి అంటావు. మా ఫ్రెండ్ వాళ్ళ అమ్మ చూడూ రోజూ చేస్తుంది. నువ్వు ఏం పనిచేస్తావేమిటి మహా" అంటూ గునుస్తూనే చపాతీలు తిండం మొదలెట్టాడు.

దీపూ అటు స్కూలుకి వెళ్ళడం, యిటు మూర్తి వంటింట్లోకి రావడం అయింది. "వాసవీ! నావి నాలుగు పేపర్స్ టైపుచేసిపెట్టాలి. మధ్యాహ్నం ఖాళీగానే వుంటావు కదా! అర్జంట్‌గా రేపు పోస్టులో పంపించేయాలి" అంటూ హడావిడిగా టిఫిన్‌చేసి వెళ్ళిపోయాడు.

ఇల్లంతా ఒక్కసారి నిశ్శబ్దమైపోయింది. అప్పటిదాకా పేపర్ చదువుతున్న వికాస్ అక్కని పలకరించడానికి వచ్చాడు. ఠంగ్‌ఠంగ్ మంటూ గడియారం పది గంటలు. కొట్టింది. వాసవి డైనింగ్‌టేబుల్‌నిండా పరిచేసినట్లున్న ప్లేట్లు, నీళ్ళగ్లాసులు, కాఫీగ్లాసులు అన్నీ సింకులో పడేసి శుభ్రంగా తోమి లోపల పెట్టింది.

"ఏమిటే అక్కా పనిమనిషి లేదా?"

"లేదురా. ఇప్పుడు ఇక్కడ పని మనుషులు దొరకడంలేదు. ఒకవేళ దొకినా వంద రూపాయలు అడుగుతున్నారు. పోనీ పని చేసుకోలేక అడిగినంతా ఇచ్చి పెట్టుకుందామనుకున్నా పదిహేను రోజులు చేస్తారు. పదిహేను రోజులురారు. కంపెనీ కూలీల కింద పని దొరికింది. డైలీ వేజస్ మీద వెళ్ళిపోతారు.



కాని ఆ రోజు రామని ముందే చెబుతారా అంటే అదీ చెప్పరు.

12 గంటల దాకా చూసుకుని అప్పుడు చేసుకోవటం. డబ్బూ ఇవ్వీ, సుఖమూ లేక వాళ్ళతో పడలేక పెట్టుకోలేదురా! నేనే చేసుకుంటున్నాను" అంది ఇంటి నిండా విప్పి పడేసిన బట్టలు వాషింగ్ మెషిన్లో వేస్తూ.

"మరి చాకలాడు కూడా లేడా?" వికాస్ ఆశ్చర్యంగా అడిగాడు.

"వాళ్ళు ఎప్పుడో చాకిరేవు మానేసారు. అడుగడుక్కీ లాండ్రీలు, డ్రైక్లీనింగ్ షాపులూ వచ్చాయి. వాటికి బోల్డు ఖరీదు. పైగా మీ బావ వాషింగ్ మెషిన్ ఉంది కదా ఇంకెందుకు లాండ్రీకెయ్యడం అంటారు. అదీ నిజమే. ఇంత ఖరీదు పెట్టి వాషింగ్ మిషన్ కొన్నాక డబ్బిచ్చి వుతికించుకోవడం నాకూ నచ్చలేదు" అంది మొద్దులా వున్న దుప్పటి మిషన్లోంచి తీసి నీళ్ళలో జాడిస్తూ.

"ఆ కొనుక్కునే మిషన్ ఏదో పూర్తి ఆటోమేటిక్‌ది కొన లేకపోయావా? నీకు ఏం సుఖముంది. అంతంత బరువుని జాడిస్తున్నావు?"

ఫారిన్‌లో వున్నంత ఎడ్వాన్స్ మిషన్స్ ఇక్కడ దొరకవు. దొరికినా వేల మీద వున్నాయి. మాలాంటి వాళ్ళకి అందుబాటులో వున్నాయి కదా కనీసం బ్రష్ చేసే పనైనా తప్పుతుందని ఇవి కొనుక్కోవడం" అంది బట్టలన్నీ ఆరేస్తూ. "ఎంతయిందిరా టైము?"

"పన్నెండు అవుతోంది".

"అమ్మ బాబోయ్ బావ భోజనానికి వచ్చే టైము అయిపోతోంది. వంట చెయ్యాలి." అంది, గబగబా ఫ్రిజ్ తెరచి కూరలు తరగడం మొదలెట్టింది. గేస్ వెలిగించి కుక్కర్ ఎక్కించి అన్నం, పప్పు, కూర పడేసి ఇంకో దానిమీద పచ్చడికి వేయించింది. మిక్సీ పెట్టి పచ్చడి చేసింది. ఇవన్నీ మిషన్‌లా చకచకా చేసుకు పోతూంటే వికాస్ అక్క వెనకే తిరుగుతూ ఖబుర్లు చెబుతూ కూర్చున్నాడు. వంట చేస్తూనే కుక్కర్ అయ్యే టైములో చెల్లాచెదురుగా పడేసిన బుక్స్, బొళ్ళు తీసి, ఇల్లంతా నీట్‌గా సర్ది ఇల్లు తుడిచి తడిగుడ్డ పెట్టి పోచ చేసింది.

"ఏమిటో అమ్మావాళ్ళు తెల్లారేటప్పటికి ముందు ఇల్లు తుడుచుకునే వారు. ఇప్పుడు మేము 12 గంటలకి ఆ పని చేస్తున్నాము. ముందరే చేద్దామంటే పిల్లలు లేవరు. మంచాలెత్తందే తుడవడానికి వుండదు. బూట్ల దుమ్ము. కాగితాలు ఇంటి నిండా పడేస్తారు. పొద్దున్నే తుడిచినా తుడిచినట్లు వుండదు. దుమ్ము ఎక్కువ. ఎంత దులిపినా పడుతూనే వుంటుంది. అమెరికాలో దుమ్ము వుండదట కదా" అంది వాసవి.

"ఔను! అక్కడ ఈగలు, దోమల బాధలు కూడా లేవు. కార్పెట్లు, దుమ్ము తీసెయ్యడానికి మిషన్ వుపయోగిస్తే చాలు. అది మొగవాళ్ళైనా అక్కడ చేసేస్తారు. సెలవు రోజుల్లో ఆడా, మగా కలిసి ఇల్లు శుభ్రం చేసుకుంటారు ఇద్దరూ ఉద్యోగస్థులైనాను".

డైనింగ్ టేబుల్ మీద అన్నీ సర్దుతుండగానే మూర్తి వచ్చేసాడు.

పొగలు కక్కుతున్న అన్నాన్ని చూస్తూనే "ఎప్పుడూ అన్నం ఇంత వేడి వేడిగా వడ్డిస్తావేం? కొంచెం ముందు చేయరాదా? 9.30 కల్లా మేం వెళ్ళిపోతే ఇంట్లో ఖాళీగా ఏం చేస్తావు" అన్నాడు విసుక్కుంటూ మూర్తి.

వికాస్ ఏదో అనబోయి వూరుకున్నాడు.

హడావుడిగా భోజనం చేసి మూర్తి తిరిగి ఆఫీసుకి వెళ్ళిపోయాడు. డైనింగ్ టేబుల్ సవరించి తుడుచుకొని గిన్నెలు తోముకుని ఇవతలకి వాసవి వచ్చేటప్పటికి గడియారం 2.30 చూపిస్తోంది. కాసేపు పత్రిక తీసుకుని మంచం మీద వాలిందో లేదో కాలింగ్ బెల్ మోగింది. వాసవి లేచి వెళ్ళి తలుపు తీసింది. పక్కింటి వనజ. వనజ ద్యోగం చేస్తోంది. పనిమనిషి పగలంతా ఇంట్లో వుండి అన్ని పనులూ చేస్తుంది. వనజ కొడుకు చిన్నవాడేను. వాడు విపరీతంగా అల్లరి చేస్తాడు. వాళ్ళ అమ్మ పగలంతా పిల్లవాడ్ని విడిచి వుంటుంది. కాబట్టి వాడు ఏం చేస్తున్నాడో పట్టించుకోదు. విపరీతమైన గారాబం. ఇంక వనజ ఆఫీస్‌కి వెళ్ళి ఏం చేస్తుందో కానీ ఎప్పుడూ నవలలు చేతిలో వుంటాయి. మొత్తం లైబ్రరీలో వున్న పుస్తకాలన్నీ చదివేసింది.

"రండి వనజా!" అని ఆహ్వానించింది వాసవి. "ఇవాళ ఆఫీస్ లేదా?"

"వుంది కానీ బోర్‌గా అనిపించి శెలవ పెట్టేసాను. హాయిగా మీకేమండి ఇంట్లో వుంటారు. బోల్డు తీరిక వుంటుంది. ఏమైనా పుస్తకాలు వున్నాయేమో అడుగుదామని వచ్చాను" అంది వనజ. అక్కడున్న పత్రికను తిరగేస్తూ.


"అది ఆఫీస్ క్లబ్ నుంచి మావారు తీసుకు వచ్చారు. ఇంకా చదవలేదు" అంది వాసవి.

"సరే ఇప్పుడే చూసేసి ఇచ్చేస్తాను" అంటూ పత్రిక తీసుకుని వెళ్ళిపోయింది వనజ. సైన్స్ రికార్డ్ వేసి పెట్టకపోతే నీలేష్ మళ్ళీ గొడవ చేస్తాడని ఆ డ్రాయింగ్స్ వేస్తూ కూర్చుంది వాసవి.

దిలీప్ స్కూలు నుంచి వస్తూనే బూట్లు ఒక మూల, పుస్తకాల బేగ్ ఒక మూల పడేసి సోఫాలో అడ్డంగా పడుకున్నాడు. "మమ్మీ ఆకలివేస్తోంది. ఏం టిఫిన్ చేశావ్?" అని అడిగాడు.

పాపం రోజూ బస్సులో పడి స్కూలుకి వెళ్ళాలి. బస్సులు కిక్కిరిసి వుంటాయి. ఎలా అవస్థపడి ఎక్కుతాడోను. బస్తాలా ఆ పుస్తకాల బరువు ఒకటి భుజాలు పడిపోతూను. అటు పొద్దున్న అన్నం తినే టైము కాదు! వచ్చేటప్పటికి 3-30 అవుతుంది. అప్పుడూ అన్నం తినరు. చప్పగా చల్లారి పోయిన టిఫిన్ బాక్స్. ఏం చదువులో ఏమిటోను. స్కూలు నుంచి రాగానే పిల్లలు వేలాడిపోతారు అని బాధపడింది వాసవి బూట్స్, బుక్స్‌ని తీసి దాస్తూను.

## గడుసులోకం —బాబు



ఇ:వేమన పద్యాలు | మదమదు




మదము చేత లోకమాయలు తెలియక
మదము చేత దన్ను మఱచు నెపుడు
బుద్ధిలేక చెడును శుద్ధపశువు వోలె
విశ్వదాభిరామ వినుర వేమ

వంటింట్లోకి వెళ్ళి గబగబా కాస్త టిఫిన్ చేసి పట్టుకు వచ్చి ఇచ్చింది. అవి తిని హోమ్‌వర్క్ చేసుకుంటూ కూర్చున్నాడు దిలీప్. "అమ్మా! మా యూనిట్ టెస్ట్ వచ్చే వారం నుండే. మాకు పోర్షన్ కంప్లీట్ అవ్వలేదు కదా రోజుకి రెండు లెస్సన్స్ చెప్పేస్తానంది మా టీచర్. క్వశ్చన్ ఆన్సర్స్ రాసుకురమ్మంది. ఎప్పుడు చెప్తావ్" అని అడిగాడు దీపూ. "ఇంకా ప్రాజక్ట్ వర్క్ కూడా ఇచ్చారు. మీ మమ్మీ హెల్ప్ తీసుకోమన్నారు అది కూడా చేయాలి".

"రాత్రి ఏడు గంటలకు క్వశ్చన్ ఆన్సర్స్ చెబుతాలే.

## ఆలోచించు

సండే ప్రాజక్ట్ వర్క్ చేద్దాము. సరేనా!" అంది ఏం చదువులో ఏమిటో పేరెంట్స్‌కి పనిష్మెంట్ అనుకుంటూ.

ఇంకా పేపర్స్ టైప్ చెయ్యాలి. అప్పుడే 5 గంటలయిపోయింది అనుకుంటూ మూర్తి ఫారిన్ నుండి తీసుకొచ్చిన పోర్టబుల్ టైపురైటరు ఇవతలకి తీసి టైపు చేయడం మొదలెట్టింది. అవి పూర్తి కాకుండానే నీలేష్ కాలేజి నుంచి వచ్చేసాడు. వాడికి కాఫీ, టిఫిన్ పెట్టి ఆరేసిన బట్టలు మడతలు పెట్టి, స్కూలు యూనిఫాం ఇస్త్రీ చేసి మళ్ళీ రాత్రి వంట ప్రయత్నం మొదలెట్టింది.

మూర్తి ఆఫీస్ నుంచి రావడం, భోజనాలు హడావడి, దీపూకి చదువు చెప్పి వాసవి మూర్తి, వికాస్ దగ్గరికి వచ్చేటప్పటికి రాత్రి 10 గంటలైంది.

వాసవీ పేపర్సు టైప్ చెయ్యడం పూర్తి కాలేదేమిటి? అర్జెంట్‌గా పంపాలని చెప్పాను కదా! అని అడిగాడు మూర్తి.

"పొద్దుట్నుంచీ తీరుబడి కాలేదండి" అని ఇంకా ఏదో చెప్పబోతోంటే–

"చూడు వికాస్ ఈ ఇండియాలో ఆడవాళ్ళు!ఇంట్లో కూర్చునే టైము లేదంటారు. మేము పొద్దున్నే వెళ్ళిపోతామా. పగలంతా ఏం చేస్తున్నట్లు. ఉద్యోగం చేస్తోందా ఏమన్నానా! ఎన్ని ఆధునిక సౌకర్యాలు కొనిపెట్టనీ మళ్ళీ పాత పాటే పాడుతారు. వీళ్ళని మాత్రం సంతృప్తిపరచలేం" అంటూ మూర్తి అంటోంటే అలసిపోయి వున్న వాసవి ఆ మాటలకి మనసు కష్టం అనిపించి కళ్ళమ్మట నీళ్ళు తిరిగితే గబుక్కున వాళ్ళకి తెలియకుండా మొహం పక్కకు తిప్పుకుని కళ్ళు తుడుచుకుంది.

* * * * *

వీడియో కాసెట్ అక్కడితో అయిపోయింది. చూస్తున్న మూర్తి నీలేష్, దిలీప్ నిశ్శబ్దంగా వుండిపోయారు. కాసేపు అయ్యాక వికాస్ అన్నాడు. "బావా పగలంతా అక్క ఏం చేస్తోందో చూశావు కదా! ఒక్క ఓదార్పు మాట మీ దగ్గర్నుంచి వస్తే అక్క ఎంత సంతోషిస్తుంది. అమెరికా తోటి మనదేశాన్ని ఎందుకు పోలుస్తావు? అక్కడ ఆడవాళ్ళు ఉద్యోగాలు చేస్తున్నా. వచ్చాక ఆడమగా కలిసి పనిచేసుకుంటారు. అన్నీ టిన్ ఫుడ్ రడీమేడ్‌గా దొరుకుతుంది. చేసుకోవడం తేలిక. ఇంకా అభివృద్ధి చెందుతున్న దేశం మనది. ఈ ఆధునిక యుగంలో చదువుకున్న మహిళ పిల్లలకి చదువులు చెప్పడం, భర్తకి తోడూ, నీడగా ఆఫీసు పనిలో సాయం చెయ్యడం అన్ని రకాలుగానూ ద్విపాత్రాభినయం చేస్తోంది. అక్క పరిస్థితి చూస్తే మీకు అర్థం కావడం లేదా పగలంతా ఏం చేస్తున్నదీ, ఒక్క తీయని మాటకే సంతోషిస్తుందే. ఈ దేశంలోని ఆడవాళ్ళ గురించి కామెంట్ చేసే ముందు ఒక్కసారి ఆలోచించండి. ఇండియాలో ఆడవాళ్ళే రాబట్‌లు. వేరే రాబట్‌లు ఎందుకు" అని ఆవేశంగా అన్నాడు వికాస్.

**చిన్న మనవి:**—ఈ కథ చదివి వీడియో ఫిలిమ్ ఎలా తీశారు అన్న ప్రశ్న ఉదయించవచ్చు. ఉరుకులు, పరుగులతో మొదలు పెడుతున్న దినచర్యలో సగటు భారతదేశ మహిళ ఆధునిక సదుపాయాలు ఉన్నప్పటికీ ఎంత కష్టపడవలసి వస్తుందో చెప్పడమే నా ముఖ్యోద్దేశము – రచయిత్రి □